క్లుప్తంగా

సుదర్శన హోమం

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలకేంద్రం అన్నపురెడ్డిపల్లిలో ఉన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సుదర్శనహోమం ఘనంగా నిర్వహించారు. నిత్యవాహనం, మూలమంత్ర హోమాలు, నిత్యపూర్ణాహుతి, బలిహరణము నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలను ఆలయ ఇన్‌చార్జ్ మేనేజర్ పీవీ రమణ పర్యవేక్షించారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



సీసీ రోడ్ల నిర్మాణంలో ఎమ్మెల్యే, నాయకులు

దుమ్ముగూడెం: పంచాయతీరాజ్ నిధులు రూ.30లక్షలతో ఆదివారం మండలంలోని లక్ష్మీనగరం, సున్నంబట్టి, ములకపాడు గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం మండలంలో జరిగిన పలు వివాహ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని వధువరులను ఆశీర్వదించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, కాంగ్రెస్ నాయకులు లంకా శ్రీనివాస రావు,అన్నె సత్యనారయణమూర్తి, కెల్లా శేఖర్, పిలక వెంకటరమణారెడ్డి, గడ్డం బాలాజీ, మట్టా శివాజీ, శ్రీధర్ తదితరులున్నారు.

సారపాకలో గ్రామసభ



గ్రామసభలో ఈజీఎస్ పనులపై ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బూర్గంపాడు: సారపాక గ్రామపంచాయతీ పరిధిలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ గ్రామసభను ఆదివారం సారపాకలో నిర్వహించారు. కూలీల శ్రమకు తగిన వేతనాలు అందలేదని కొందరు నాయకులు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. కొలతల పేరుతో కూలీలకు రోజుకు రూ.150 వేతనం కూడా పడటం లేదని గ్రామసభలో ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీ కార్యదర్శి మహేష్ అధ్యక్షతన జరిగిన ఈ గ్రామసభలో ఈజీఎస్ సోషల్ ఆడిట్ అధికారులు, కూలీలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు అందజేస్తున్న దృశ్యం

మణుగూరుటౌన్: కొత్తగూడెంలో జరిగిన ఉమ్మడి రాష్ట్రాల తైక్వాండో ఛాంపియన్ షిప్–2025లో మణుగూరు విద్యార్థులు బహుమతులు సాధించారని కరాటే మాస్టర్ కాశిమల్ల పద్మ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బ్లాక్ బెల్ట్ విభాగంలో జక్కం మిధుల శ్రీ వెండి పతకం, ఆరెంజ్ బెల్ట్ విభాగంలో జల్లారపు చతుర్వేద్, వైట్ బెల్ట్ విభాగంలో గోకినపల్లి ఆశ్లేష, దారావత్ సంజన, వాంకుడోత్ దీక్షిత, తోర్లకుంట మునేశ్వరి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి బహుమతులు సాధించారన్నారు. ఈ సందర్భంగా కేశవ్ గౌడ్ అకాడమీకి చెందిన మాస్టర్ కేశవ్ గెలిచిన విద్యార్థులను, మాస్టర్‌లను అభినందించారు.

ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలి

మణుగూరురూరల్: మండల పరిధిలోని పగిడేరు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధమై నిరాశ్రయులైన కుంజా కేశవరావు కుటుంబానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కాలిపోయిన పూరింటిని ఆయన పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య, జిల్లా నాయకులు కులగాని బ్రహ్మచారి, నిమ్మల వెంకన్న, కొమరం కాంతారావు, కుంజా నరసింహ రావు, కుంజా రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ దీక్షలు

మణుగూరురూరల్: ఎస్సీ వర్గీకరణ చట్టం రాకముందే గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3 పరీక్షా ఫలితాలను ప్రకటించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షలను రాజన్న, అర్రా కనకన్నలు ప్రారంభించి సంఘీభావం తెలిపారు. దీక్షలో కూర్చున్న వారిలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ కొమ్ము హుస్సేన్, జిల్లా అధ్యక్షురాలు చిట్యాల రజిత, మండల అధ్యక్షులు మోదుగు వెంకటేశ్వర్లు, నాయకులు ఉసికెల కొండయ్య, మంద కృష్ణ తదితరులు ఉన్నారు.



పట్టణ శివారులో పడేసిన చెత్త..



మున్సిపాలిటీ కార్యాలయంలో నిరుపయోగంగా ఉంచిన యంత్ర సామగ్రి

నిర్వహణలో నిర్లక్ష్యం

సమస్యల సుడిగుండంలో మణుగూరు మున్సిపాలిటీ

- 20 వార్డులకు ఆరు ఆటోలు, ఒక్కటే ట్రాక్టర్..
- మూలన పడ్డ విలువైన యంత్ర సామగ్రి
- పట్టింపులేని అధికార యంత్రాంగం

మణుగూరు మున్సిపాలిటీలో చెత్తసేకరణ, తాగునీటి సరఫరా అరకొరగా సాగుతోంది. ప్రధాన వార్డులు మినహా మిగతా వార్డుల్లో తూతూ మంత్రంగా పనులు జరుగుతున్నాయి. అన్ని వార్డుల నిర్వహణకు అవసరమైన యంత్రాలు, సామగ్రి కొనుగోలు చేసినప్పటికీ నిర్వహణ లోపంతో అవి మూలనపడ్డాయి. దీంతో అన్నీ ఉన్నా అల్లుడినోట్లో శని అన్న చందంగా మున్సిపాలిటీ పరిస్థితి తయారైంది.

మణుగూరుటౌన్: మణుగూరు మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి. వీటన్నిటి నిర్వహణ కేవలం కార్మికులతో సాధ్యపడదని, వారికి తోడు యంత్రాల సహాయంతో నిర్ణీత సమయంతో పనులు చక్కబెట్టవచ్చని గతంలో అధికారులు భావించారు. దీంతో స్వచ్ఛ సర్వేక్షన్ 2021–22లో భాగంగా లక్షలు వెచ్చించి జటాయువులు, స్వీపింగ్ మిషన్లు, జేసీబీ, సక్కింగ్ మిషన్లు తీసుకొచ్చారు. కాని వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి కార్యాలయంలో మూలకుపడ్డాయి. వాటిని పట్టించుకున్న నాథుడు లేడు. దీంతో మున్సిపాలిటీ లక్ష్యం నిరుగారినట్లైంది.

మందకోడిగా చెత్తసేకరణ

యంత్ర సామగ్రి అందుబాటులో లేకపోవడంతో మున్సిపాలిటీ నిర్వహణ కష్టతరంగా మారింది. ప్రస్తుతం చెత్త సేకరణను వర్కర్లతో చేపడుతున్నారు. అందుబాటులో ఉన్న ఆటోలలో దానిని తరలిస్తున్నారు. అయితే 17 ఆటోలకు ఆరు ఆటోలు మాత్రమే వార్డుల్లో, ఒక ట్రాక్టర్ మాత్రమే ప్రధాన రహదారిపై చెత్త సేకరిస్తున్నాయి. దీంతో చెత్త రవాణా సాఫీగా సాగడం లేదు.

కంపుకొడుతున్న మున్సిపల్ గ్రామాలు

యంత్రాలు మూలనపడడం, 20 వార్డులకు సరిపడా ట్రాక్టర్లు లేకపోవడం, అందరు వర్కర్లూ పనిలో పాల్గొనకపోవడంతో అన్ని ప్రాంతాల్లో చెత్త సేకరణ జరగడం లేదు. ముఖ్యంగా రాయిగూడెం, కమలాపురం గ్రామాల్లో చెత్త సేకరణ వాహనాలు కనిపించడం లేదు. చెత్తబండి నెలరోజులకు ఒకసారి వస్తోందని చినరాయిగూడెం డబల్‌బెడ్రూం వాసులు చెబుతున్నారు. దీంతో మున్సిపాలిటీ పరిధిలోని ఆయా శివారు గ్రామాల్లో చెత్త మూలుగుతోంది. పట్టణంలోనూ వ్యాపారులు, ప్రజలు ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. చేసేది లేక ఊరి చివర చెత్త పడేస్తున్నారు. దీంతో అటువైపుగా వెళ్లాలంటేనే ముక్కు మూసుకుని వెళ్లాల్సిన దుస్థితి ఉంది.

చినరాయిగూడెంకు తాగునీటి గోస

మున్సిపాలిటీకి విసిరేసినట్లుగా ఉన్న చిన రాయిగూడెం ఉంటుంది. ఇక్కడి ప్రజలు చెంతనే గోదావరి ఉన్నా తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. సుమారు 300 గడపలు ఉన్న ఈ గ్రామంలో ఇంటింటికీ నల్లాలు లేవు. బోరు మోటార్లు, చేతి పంపులపైనే ఆధారపడి జీవించాల్సిన పరిస్థితి నెలకొంది. ఇక్కడ నెల రోజులు తిరిగొస్తేగాని చెత్త సేకరణ వాహనాలు కనిపించకపోవడంతోపాటు డ్రెయినేజీ వ్యవస్థ, సైడ్ కాల్వలు కూడా లేవు.

సమస్యల పరిష్కారానికి కృషి



వర్కర్ల జీతాలు పెండింగ్‌లో ఉండటంతో వారు గైర్హాజరవుతున్నారు. దీంతో సమస్య ఉత్పన్నమవుతోంది. వారికి జీతాలు చెల్లించాం. మున్సిపాలిటీలో చెత్త సేకరణలో జరుగుతున్న లోపాలను క్షేత్రస్థాయిలో గుర్తించాం. వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. పక్కకు పెట్టిన సక్కింగ్ మిషన్, స్వీపింగ్ వంటి మిషనరీలు మణుగూరు మున్సిపాలిటీకి మెయింటెనెన్స్ భారంగా మారే అవకాశం ఉంది. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి మిషనరీపై నిర్ణయం తీసుకుంటాం. అప్పటిదాకా ఏం చెప్పలేం.

– టి.ప్రసాద్, మున్సిపల్ కమిషనర్

వృత్తి నైపుణ్యాన్ని పెంచుకోవాలి



నూతన అధ్యక్షుడిని సన్మానిస్తున్న ఆర్‌ఎంపీలు

అశ్వారావుపేటరూరల్: గ్రామీణ వైద్యులంతా కొత్తగా వస్తున్న వ్యాధులు, వైరస్‌లు, ఇతర అనారోగ్య పరిస్థితులకు తగినట్లు శాస్త్రవేత్తలు సిద్ధం చేస్తున్న ఔషధాల పట్ల అవగాహన పెంచుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఆర్‌ఎంపీ, పీఎంపీ కమ్యూనిటీ పారామెడికల్ వైద్యుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సత్యవరపు జగదీష్ సూచించారు. ఆదివారం మండల పరిధిలోని గుర్రాల చెరువు గ్రామ శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఆ సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ వైద్యులంతా ఐక్యమతంగా ఉండాలని సూచించారు.. అనంతరం అశ్వారావుపేట మండల నూతన కమిటీ అధ్యక్షుడిగా సత్యవరపు చంద్రశేఖర్, కార్యదర్శిగా వేల్పుల సత్యనారాయణ, మీడియా కోఆర్డినేటర్‌గా మడిపల్లి వెంకటేశ్వరరావు, గౌవర అధ్యక్షుడిగా పి.ప్రసాద్‌రావు, సలహాదారులుగా ఎంజి.శంకర్, పి.సత్యానారాయణ, కె.రామకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా వై.ప్రేమసాగర్, కోశాధికారిగా ఎస్‌కె.వలీ, ఉపాధ్యక్షుడిగా మోహన్‌రావు, ఎస్.మౌలానతోపాటు మొత్తం 25 మందితో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులను కమిటీ బాధ్యులంతా కలిసి ఘనంగా సన్మానించారు.

అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం



జెండా ఊపి పరుగు పందెం పోటీని ప్రారంభిస్తున్న సెక్రటరీ మహేందర్, కోచ్‌లు

దమ్మపేట: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల క్రీడా ప్రాంగణంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్ మాట్లాడుతూ.. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 80 మంది పాల్గొనగా.. వీరిలో అత్యంత ప్రతిభ చూపిన 20 మందిని ఎంపిక చేశామని తెలిపారు. వీరిని ఈ నెల 23న హైదరాబాదులో జరగనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పంపనున్నామని తెలియజేశారు. జున్ను గిరిప్రసాద్, నాగరాజు, పీడీ సరిత పాల్గొన్నారు.

ఆదివాసీలకు అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న కమిటీ బాధ్యులు

చర్ల: చర్లకు చెందిన మేమున్నాం సహాయక కమిటీ ఆధ్వర్యంలో చర్లలోని వారపు సంతకు వచ్చిన ఆదివాసీలకు అన్నదానం నిర్వహించారు. దాతలు జగిడి రామారావు–కనకమ్మలు వారి కుమార్తె వరలక్ష్మి జ్ఞాపకార్థం అందజేసిన ఆర్థిక సాయంతో శాంతి భవన్ సమీపంలోని రైతు నర్సింహారావు కాంప్లెక్స్ వద్ద ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌తోపాలు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సంతకు వచ్చిన సుమారు 250 మంది ఆదివాసీలు అన్నదానాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మేమున్నాం సహాయక కమిటీ చైర్మన్ డాక్టర్ నీలి ప్రకాశ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అశ్వారావుపేటరూరల్: పూర్వ ఐటీఐ విద్యార్థులంతా ఒకే వేదికపై దాదాపు 44 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. అశ్వారావుపేటలోని మాధవన్ అగ్రకల్చర్ పాలిటెక్నిక్ కళాశాల కేవీ రామారావు, కె.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవేర్ ఆర్‌వీటీసీ ఐటీఐలో 1981 నుంచి శిక్షణ పొందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయికను ఏర్పాటు చేసుకున్నారు. వీరంత స్థానిక ఐటీఐ కళాశాలలో కలుసుకుని ఆ నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని రోజంతా సంతోషంగా గడిపారు. అనంతరం సీనియర్లు, నాటి గురువులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందించారు.



కళాశాల వద్ద కలిసిన పూర్వ ఐటీఐ విద్యార్థులు

మద్యపానం, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన

అశ్వాపురం: మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఆదివారం విద్యార్థులకు మద్యపాన నిషేధం, డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. మద్యపానం, డ్రగ్స్ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ అధికారి రవి, హాస్టల్ వార్డెన్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాతర

చర్ల: మండల కేంద్రమైన చర్లలోని లక్ష్మీకాలనీ సమీపంలో ఉన్న జాంబవంతుని గుట్టపై సోమవారం నుంచి శుక్రవారం వరకు రేణుకా ఎల్లమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు దేవాలయ పూజారి మడకం దేవయ్య ఆదివారం తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు పుట్ట బంగారపు పూజతో జాతర ప్రారంభమవుతుందని, మంగళవారం 8 గంటలకు బోనాలు ఎత్తడం, 10 గంటలకు పట్నం కార్యక్రమం, 11 గంటలకు శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి తిరు కల్యాణోత్సవం జరుగుతుందని ఆయన తెలిపారు. బుధ, గురు, శుక్ర వారాల్లోను పలు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

మేకలు పంపిణీ

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని రేగళ్లగుంపు దట్టమైన అటవీ ప్రాంతం నివాసం ఉంటున్న వలస గొత్తికోయల 16 కుటుంబాలకు ఆదివారం లీవింగ్ శాక్రిఫైస్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ దేవ సహాయం ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు జక్కుల రాంబాబు చేతుల మీదుగా 32 మేకలను ఉచితంగా అందించారు. ఒక్కొక్క కుటుంబానికి రెండు చొప్పున అందించిన మేకల విలువ రూ.1లక్ష 2వేల రూపాయాలు ఉంటాయని, మేకల పెంపకం ద్వారా వలస గొత్తికోయలు ఆర్థికంగా బలోపేతం కావాలని అన్నారు.

గ్రామసభ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న స్థానికులు

గుండాల: ఆళ్లపల్లి సెంటర్‌లోని రోడ్డు ఆక్రమణపై అధికారులు గ్రామ సభ ద్వారా నిర్ణయం తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. ఆదివారం ఆళ్లపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోషల్ వర్కర్ సేవ్ కొత్తగూడెం సేవ్ మున్సిపాలిటీ కన్వీనర్ జలాల్, గ్రామ పెద్దలు బుర్ర వెంకన్న, తెలగాని శీనివాస్, మాజీ ఉపసర్పంచ్ ఖయ్యూం, మాజీ విద్యార్థి సంఘ నాయకుడు సత్తర్లు మాట్లాడుతూ.. ఆక్రమణలు ఇలానే కొనసాగితే భవిష్యత్ తరాలకు రోడ్లు, ప్రభుత్వ ఆస్తులు ఏమీ మిగలవని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణపై రాజకీయ పార్టీలు సైతం నోరు విప్పాలని కోరారు.

'హలో శుభోదయం'లో ఎమ్మెల్యే



ములకలపల్లిలో రహదారిని శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ములకలపల్లి: హలో శుభోదయం అంటూ ఆదివారం వేకువ జామునే ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలకరించారు. ఆదివారం ఉదయం 6:30 గంటలకే మండల కేంద్రంలోని భక్త అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణ సమీపంలో స్థానిక నాయకులతో కలిసి స్వచ్ఛ భారత్ నిర్వహించారు. రోడ్లు ఊడ్చే కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొన్నారు. ఆ తదుపరి విజయపురి కాలనీ, అంబేద్కర్ నగర్, మంచిగంటి నగర్, భగత్ సింగ్ నగర్, రాజుపేట కాలనీలతోపాటు జడ్పీ హైస్కూల్ ఆవరణలో సీసీ రోడ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్ రావు, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, ములకలపల్లి గ్రామ శాఖ అధ్యక్ష కార్యదర్శులు పువ్వాల మంగపతి, గాడి తిరుపతిరెడ్డి, స్థానిక నాయకులు కరుటూరి కృష్ణ, కారం సుదీర్, మిరియాల అవినాష్, శనగపాటి అంజి, రవి పాలకుర్తి సుమిత్ తెలుగు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలో ఆదివారం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. రూ.1,68 కోట్ల ఎస్సీ,ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో 36 పనులు చేపట్టామన్నారు. అందులో సీసీరోడ్లకు ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పనులు వేగవంతంగా చేయడంతోపాటు నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు భోజ్యా నాయక్, దారం గోవిందరెడ్డి, సారేపల్లి శేఖర్, టి.సురేష్, బడుగు కృష్ణవేణి, రుక్మిణి, బిక్షమయ్య, యండి.ఇమ్రాన్, వసం పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని వివిధ గ్రామాల్లో మంజూరైన సీసీరోడ్ల పనులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.1.69 కోట్లు నిధులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. అనంతరం తన దత్తత గ్రామమైన రంగాపురంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు 45 రోజుల్లో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వసమా గాంధీ, పర్సా వెంకటేశ్వరరావు, వేముల రమణ, కృష్ణారావు, శివ, సత్యం పాల్గొన్నారు.

భద్రాద్రిలో 26న బహిరంగ వేలం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానం పరిధిలోని వివిధ లైసెన్స్‌ల హక్కుల కోసం ఈ నెల 26న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భద్రాచలంలోని కలగర తయారు కాటేజీ ఖాళీ స్థలం, సౌమిత్రి సదనం వద్ద కాఫీ, టీ షాపు, యాత్రికుల పాదరక్షలు భద్రపరుచు, లాకర్స్ నిర్వాహణ, సూపర్ బజార్ సెంటర్‌లోని ఖాళీ షెడ్లులకు పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. పర్ణశాలలోని చెక్క బొమ్మల విక్రయం, ఫాన్సీ షాపు నిర్వాహణ, కొబ్బరిచిప్పలు పోగుచేసుకోవడం, సీతవాగు గైడ్, ఆలయం వద్ద టాయిలెట్స్ నిర్వహణ కోసం పాట ఉంటుందని తెలిపారు. అలాగే ఆలయంలో పాత స్కార్పియో 2018 మోడల్ కారు, నెయ్యి, నూనె, జీడీపప్పు డబ్బాలు, పాత విండో ఏసీలను వేలంలో విక్రయించడం జరుగుతుందని పేర్కొన్నారు. పాటలో లైసెన్స్ పొందిన వారికి ఏడాది పాటు హక్కు కల్పిస్తామని, గతంలో ఆలయానికి బాకీ, తగాదాలు ఉన్నవారు పాటలకు అనర్హులని తెలిపారు. దేవస్థాన తానీషా మండపంలో నిర్వహించే ఈ బహిరంగ వేలం పాటకు పాటదారులు ఉదయం 11 గంటలకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు కార్యాలయానికి 08743–232428, 9515545354 నంబర్లకు ఫోన్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక 'ఇఫ్తార్'



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

మణుగూరురూరల్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లింలు నిర్వహించే కఠోర ఉపవాస దీక్షల్లో భాగంగా మణుగూరు పట్టణంలోని పూలమార్కెట్ సెంటర్‌లో ఊదా మసీద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇఫ్తార్ విందు ఆత్మీయత, అనుబంధాలను బలపరుస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, పట్టణ అధ్యక్షుడు శివసైదులు, నాయకులు టివి సుబ్బారెడ్డి, జీవరత్నం, గోరంట్ల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండలంలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా, బీజాపూర్, దంతెవాడ జిల్లాల్లోని అటవీ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీసియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను నిర్వహించారు. చర్లకు వచ్చే ప్రధాన రహదారులైన తాలిపేరు ప్రాజెక్టు, లెనిన్‌కాలనీ, కలివేరుక్రాస్‌రోడ్, దానవాయిపేట తదితర ప్రాంతాల్లో తనిఖీ చేశారు. అనుమానితులను విచారించి విడిచిపెట్టారు. తనిఖీల్లో సీఐ ఏ.రాజువర్మ, ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ్ సివిల్, స్పెషల్ పార్టీ, సీఆర్‌పీఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని వినతి

దమ్మపేట: మధ్యాహ్న భోజన కార్మికులు, తమ వేతనాలు పెంచి, పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ.. మండలంలోని గండుగులపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. గత కొద్ది నెలలుగా పెండింగ్ లో ఉన్న గుడ్లు, మెస్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీ మేరకు వేతనాలను రూ.10 వేలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో జ్యోతి, ఈశ్వరమ్మ, నాగమణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్, జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం



దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మణుగూరురూరల్: తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి, కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం అంబేద్కర్ దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గౌరవ పదవిలో ఉన్న స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు పీరినాకి నవీన్, శివసైదులు, మండల మహిళా అధ్యక్షురాలు సౌజన్య, యూత్ నియోజవకర్గ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, నాయకులు కూచిపూడిబాబు, పాలమూరి రాజు, టీవీ సుబ్బారెడ్డి, గోరంట్ల కనకయ్య, గుడిపూడి కోటేశ్వరరావు, గాండ్ల సురేష్, గుడిపూడి కోటేశ్వరరావు, రహీంపాషా తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు జయంతి

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగాన్ని చేసిన పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయా సంఘాల బాధ్యులు మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల మనోభావాలను దెబ్బతీసేలా, పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరును రావి నారాయణరెడ్డి పేరుగా మార్చడం సరికాదని అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దమ్మపేటలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



అశ్వారావుపేటరూరల్: పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



అన్నపురెడ్డిపల్లి: నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు